క్లుప్తంగా

చిన్నమ్మకు దద్దాల ఆర్థికసాయం



చిన్నమ్మను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

పీసీపల్లి: మండల పరిధిలోని అలవలపాడు పంచాయతీ వెంగళాపురం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన అంద్రా చిన్నమ్మ కాలు విరిగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గోపవరపు బొర్రారెడ్డి, లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, వాకమల్ల రాజశేఖర్‌రెడ్డి, సైకం ఏడుకొండలరెడ్డి, పాతకోట్లు పిచ్చిరెడ్డి, పెరికల వెంకటేశ్వర్లు, పాదిలి చిన్నకేశవులు, వీరాస్వామి, సుందరరావు, చిన్న బాలయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద పోస్టాఫీసులో సమస్యలు పరిష్కరించాలి

కనిగిరిరూరల్: కనిగిరి పెద్ద పోస్టాఫీసులో సమస్యలు పరిష్కారించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం ఆయన పోస్టాఫీసును పరిశీలించి, అనంతరం విలేకర్లతో మాట్లాడారు. నెల రోజులుగా పోస్టాఫీసులో సర్వర్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో పోస్టల్ సేవల్లో జాప్యం జరుగుతుందన్నారు. తక్షణం పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు.

నేడు మోటార్‌సైకిళ్ల వేలంపాట

సింగరాయకొండ: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వీర్యంగా ఉన్న 48 మోటార్‌సైకిళ్లకు బుధవారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్సై బి.మహేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. తహశీల్దార్ ఆధ్వర్యంలో వేలంపాటలు జరుగుతాయని, ఔత్సాహికులు వేలంపాటలో పాల్గొనాలన్నారు.

రూ.20 వేల ఆర్థికసాయం అందజేత

పామూరు: అనారోగ్యంతో మంచానికే పరిమితమైన బాధితునికి వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థికసాయం చేశారు. స్థానిక కరెంట్ ఆఫీస్ కాలనీకి చెందిన షేక్.సద్దాం కొంతకాలంగా పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం పార్టీ మైనారిటీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్.గయాజ్ రూ.10 వేలు, మైనారిటీసెల్ కార్యదర్శి షేక్.నాగూర్‌బాషా రూ.5 వేలు, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వాకమళ్ల రాజశేఖర్ రూ.5 వేలు అందజేశారు. గట్లా విజయభాస్కర్‌రెడ్డి, షేక్.బారాషరీఫ్, మర్రి రాజు, షేక్.రసూల్, షేక్.వసీమ్ పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధురాలి ఆత్మహత్య



లక్ష్మమ్మ మృతదేహం

సింగరాయకొండ: రైలు కింద పడి వృద్ధురాలు యెక్కటిల్లి లక్ష్మమ్మ(94) ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మంగళవారం ఉదయం సుమారు రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం, సోమరాజుపల్లి రైల్వేగేట్ మధ్య జరిగింది. స్థానికుల కథనం ప్రకారం లక్ష్మమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు శ్రీను హైదరాబాద్‌లో కాంట్రాక్టర్ పనిచేస్తుంటాడు. శ్రీను సోమవారం సాయంత్రం హైదరాబాద్ వెళుతూ తల్లి లక్ష్మమ్మను జరుగుమల్లి మండలం కామేపల్లిలో ఉంటున్న కూతురు పద్మ వద్దకు వెళ్లమని సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలోని విక్కిరాలపేట రోడ్డు వదిలి పెట్టివెళ్లాడు. తరువాత ఆమె కామేపల్లి వెళ్లిందో లేదో కానీ మంగళవారం ఉదయం రైల్వే స్టేషన్‌లో ఒకటో నంబర్ ఫ్లాట్‌ఫారం చివరకు వెళ్లి స్టేషన్‌లో ఆగబోతున్న తిరుపతి నుంచి వస్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లడంతో రైలు ఇంజన్ తగిలి ఆమె రైలు పట్టాల మధ్యలో పడి తలకు తీవ్ర గాయమైంది. ఇది గమనించిన రైలు డ్రైవర్ రైలును ఆపడంతో ప్రయాణికులు కొన ఊపిరితో ఉన్న ఆమెను రైలు కింద నుంచి కష్టం మీద బయటకు తీసి ఫ్లాట్‌ఫాం మీదకు చేర్చిన కొద్దిసేపటికే ఆమె మృతి చెందింది. ఆస్తి విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయని, చివరికి ఆమె ఆత్మహత్యకు దారితీసి ఉండవచ్చని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన డీపీటీఓ

కనిగిరిరూరల్: కనిగిరి ఆర్టీసీ డిపోను ఒంగోలు డీపీటీఓ సత్యన్నారాయణ మంగళవారం సందర్శించారు. ఆర్టీసీ డిపోలోని మౌలిక వసతుల కల్పన, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రయాణికులు వేచి ఉండే బెంచీలు తదితర సౌకర్యాల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. గుడిపాడు కొత్తపాలెం రూట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎం మొహమ్మద్ సయాన బేగం తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా చల్లగిరిగిల్ల ఎస్సీ కాలనీ రోడ్డు



గ్రామాల్లో అధాన్నంగా అంతర్గత రోడ్డు

నిధుల లేమి.. సమస్యల ఘోష..!

- పంచాయతీలను వెంటాడుతున్న నిధుల లేమి..
- విడుదల కానీ 15వ ఆర్థిక సంఘ నిధులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కనిగిరిరూరల్:

కూటమి పాలనలో పల్లెలు సమస్యలు ఘోషిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం పల్లెపాలనను నిర్వీర్యం చేస్తోంది. ఏడాది నుంచి పంచాయతీకి ఆర్థిక సంఘ నిధులు విడుదల కాక పోవడంతో గ్రామీణ ప్రాంతాలు కనీస మౌలిక వసతులకు నోచుకోక కునారిల్లుతున్నాయి. పంచాయతీల ఖజానాల్లో నిధులు లేక పోవడంతో వీధి దీపాల వెలుగులు కరువయ్యాయి.. కనీసం చెత్తతీసే పరిస్థితి లేదు.. బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు కన్పించడం లేదు. వెరసీ పంచాయతిలకు చంద్ర గ్రహణం పట్టిందంటే అతిశయోక్తి కాదు.

రెండో విడత నిధుల కోసం ఎదురుచూపు...

పంచాయతీల అభివృద్ధికి కేటాయించే ఆర్థిక సంఘ నిధులు సక్రమంగా విడుదల చేయడం లేదు. 15వ ఆర్థిక సంఘ రెండో విడత నిధులు విడుదల చేయలేదు. 2024-2025 ఏడాదికి గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో తొలి విడత నిధులు వచ్చాయి. ఆతర్వాత మార్చిలో రావాల్సిన నిధులు ఇంకా రాలేదు. దీంతో పంచాయతీ సర్పంచ్‌లు నిధుల లేమితో పంచాయతిల్లోని గ్రామాల్లో తిరిగేందుకు ముఖం చాటేస్తున్నారు.



చిల్లచెట్లతో మూసుకుని పోయిన తురకపల్లి-ఎస్సీ కాలనీ రోడ్డు

ఎక్కడి సమస్యలు అక్కడే..

ఆర్థిక సంఘ నిధులు గ్రామ పంచాయతీ జనాభను బట్టి ఒక వ్యక్తికి రూ.200 నుంచి రూ.250 లెక్కన మంజూరు చేస్తారు. ఎంత చిన్న పంచాయతీకైనా కనీసం రూ.2 లక్షలు విడుదల అవుతాయి. ఎక్కువ శాతం పంచాయతీలకు కనీసం రూ.4 నుంచి రూ.5 లక్షలు వస్తాయి. ఆ నిధుల్లో పారిశుధ్య చర్యలకు 30శాతం, వీధి లైట్లకు, 15 శాతం, రోడ్లు, నీరు అభివృద్ధికి 15 శాతం, హెల్త్ సామాగ్రి కొనుగోలు ఇలా అనే రకం వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కానీ నిధులు లేమితో కనీసం గ్రామాల్లో చిల్లచెట్లు తొలగించే పరిస్థితి లేదు. ప్రస్తుతం వర్షాలు కురవడం.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా.. గ్రామాల్లో శానిటేషన్, ట్యాంక్‌ల క్లోరినేషన్ జరిగే పరిస్థితి లేదు. కొన్ని పంచాయతీల్లో వీధి దీపాలు కూడా వెలగని దుస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. పంచాయతీల్లో నుంచి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు చిల్లచెట్లు, పిచ్చి చెట్లతో మూసుకుని పోయాయి. దీంతో అనేక చోట్ల రాత్రి పూట పనులు చూసుకుని ఇళ్లకు వెళ్లే గ్రామీణ వాసులు విష సర్పాలతో ఇబ్బందులు పడుతున్నారు. అనేక గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణ పూర్తిగా పడకేసింది. వాస్తవానికి 16వ ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయాలి. కానీ 15వ ఆర్థిక సంఘ నిధులకే ఇంకా మోక్షం కల్గలేదని పంచాయతీ సర్పంచ్‌లు వాపోతున్నారు.

20 రోజుల నుంచి లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నాం:

సుమారు 15 రోజుల నుంచి కాలనీ ప్రధాన వీధిలోని రోడ్డు మీద గల వీధి లైటు వెలగడం లేదు. దీంతో రాత్రి పూట అంధకారంలో ఇబ్బందులు పడుతున్నాం. త్వరతగతిన వీధిలైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలి. చల్లగిరిగిల్ల రోడ్డు మీద వీధిలో, గ్రామంలో కొన్ని లైట్లు వెలగడం లేదు.

కొండయ్య, చల్లగిరిగిల్ల ఎస్సీ కాలనీ

వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విజయభాస్కర్‌రెడ్డి



జగన్‌మోహన్‌రెడ్డికి బొకే అందజేస్తున్న ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఐటీ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి, సీఎస్పురం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు, సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, నల్లగండ్ల సర్పంచ్ బత్తుల శ్రీనివాసులరెడ్డి, మార్రెళ్ల వెంకటరెడ్డి, దేవిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, దేవిరెడ్డి శ్రీ వాసులరెడ్డి, సానికొమ్ము అంజిరెడ్డి వేశపోగు సుందర్ బాబు, పగడాల వెంకటేశ్వరరెడ్డి, గంటా శ్రీనివాసులరెడ్డి, మేకల బాలుయాదవ్, సర్పంచ్ బొట్లా చిరంజీవి, పెరుగు సుబ్బరామయ్య, పులిమి నారాయణ, బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ఉన్నారు.

– హనుమంతునిపాడు/పామూరు

ఆల్‌బెండజోల్ మాత్రలతో ఆరోగ్యం



నులిపురుగు నివారణ మాత్రలు మింగిస్తున్న చైర్మన్ గఫార్, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ

కనిగిరిరూరల్: విద్యార్థులు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పని సరిగా మింగాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానికజెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను మిగించారు. అనంతరం హెచ్‌ఎం కలువ విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సృజన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డాక్టర్ ఫణి,మరియు ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: రక్తహీనత, కడుపునొప్పి నివారణకు చిన్నారులు నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ జీవీ కృష్ణారావు అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాతసింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థుల చేత స్వయంగా మాత్రలు మింగించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ వైద్యాధికారి షేక్ ఆయేషా విద్యార్థులతో మింగించారు. ప్రభుత్వ వైద్యాధికారి వంశీధర్, ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి, సీహెచ్ పద్మజ, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామూరు: మండలంలో 11వ812 మందికి నులిపురుగుల మాత్రలు వేసినట్లు డాక్టర్ షేక్.దాదాషరీఫ్ తెలిపారు. హెచ్‌ఈఓ పెరుగు శ్రీధర్, కేజీబీవి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మండ్లా శైలజ, ఏఎన్‌యం మౌనికారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొన్నలూరు: ఆల్‌బెండజోల్ మాత్రలు మింగటం వలన చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ డాక్టర్ రవికిరణ్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో 19 ఏళ్ల లోపు పిల్లలకు, కిషోర బాలికలకు మంగళవారం ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. 5107 మంది చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించామన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు కృష్ణచైతన్య, శ్రీకాంత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో 5846 మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలు మింగించారు. సీహెచ్‌ఓ మురళి, హెల్త్ అసిస్టెంట్ కొండయ్య, ఎంఎల్‌హెచ్‌పి శ్రీరామ లక్ష్మీకాంతమ్మ, వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

12 గంటలకే సచివాలయానికి తాళం



సచివాలయానికి వేసిన తాళం చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ కొండారెడ్డి



మాధ్యాహ్నం 12 గంటల సమయంలో ఖాళీగా కనిపిస్తున్న కోటపాడు సచివాలయం

- సచివాలయంలో కనిపించని సిబ్బంది
- నిరసన వ్యక్తం చేసిన సర్పంచ్, గ్రామస్తులు

పొన్నలూరు: మండలంలోని కోటపాడు సచివాలయం మంగళవారం మధ్యాహ్నంకే మూతపడింది. ఉదయం విధులకు హాజరైన సిబ్బంది సాయంత్రం వరకు ఉండకుండా మధ్యాహ్నం 12 గంటలకే సచివాలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. సచివాలయంతో పాటు పక్కనే ఉన్న రైతు సేవా కేంద్రానికి కూడా తాళం వేసి వెళ్లిపోయారు. వాస్తవంగా పంచాయతీ కార్యదర్శి ఎంపీడీఓ కార్యాలయంలో మీటింగ్‌కు వెళ్లగా మిగిలిన సిబ్బంది విధులు నిర్వహించకుండా మధ్యాహ్న 12 గంటలకే వెళ్లిపోయారు. దీంతో పనుల నిమిత్తం సచివాలయం దగ్గరకు వచ్చిన సచివాలయ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు సచివాలయానికి తాళం వేయడం చూసి అవాక్కయ్యారు. దీంతో స్థానిక ప్రజలు సర్పంచ్‌కి సమాచారం ఇవ్వడంతో సర్పంచ్ అన్నెం కొండారెడ్డి సచివాలయం వద్దకు వచ్చి రైతు సేవా కేంద్రం, సచివాలయానికి తాళం వేసి ఉండటం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో సిబ్బంది సక్రమంగా సచివాలయానికి రావడం లేదని సచివాలయం గుమ్మం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. సిబ్బంది విధులకు సరిగా హాజరు కావడం లేదని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని సర్పంచ్ తెలిపారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

కనిగిరిరూరల్:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ బలహీన వర్గాలకు విద్యను అందని ద్రాక్షలా మారుస్తున్నాయని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మాజీ నాయకులు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎస్‌కే గులాం హుస్సేన్ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థి, యువత దేశ భక్తి, త్యాగ స్ఫూర్తిని కల్గి ఉండాలన్నారు. సమాజ రుగ్మతలపై విద్యార్థులు, యువత తిరుగుబాటుకు సిద్ధం కావాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే తాహీద్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చదువు పోరాడు.. చదువుకై పోరాడు నినాదంతో పనిచేయాలన్నారు. తొలుత స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించారు. నాయకులు సయ్యద్ ఆఫ్రాజ్, ఇఫ్రాజ్, గూడూరి సురేష్, సయ్యద్ యాసీన్, పందిటి మోహన్, జి.బాలిరెడ్డి, ఎస్‌కే ఖాశిం పీరా, మాచేపల్లి పూర్ణ, మీరావలి, తరుణ్ పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై విచారణ చేయండి

టంగుటూరు: అనంతవరం పంచాయతీలో ప్రభుత్వ నిధులు వినియోగంపై సమగ్ర విచారణ కావాలని తేటపురం గ్రామస్తులు మంగళవారం ఎంపీడీఓ దేవసేనకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మర్రి భాస్కర్రెడ్డి, అర్జున్ మాట్లాడుతూ పంచాయతీలో ఇటీవల పంచాయతీ కార్యదర్శి, టీడీపీ నాయకులు పనులు చేయకుండానే పనులు చేసినట్టు రికార్డులు చూపించి ప్రభుత్వ సొమ్మును మింగేశారని ఆరోపణలు వచ్చాయన్నారు. దీనిపై విచారణ చేయాలని కోరారు.

వెలిగొండకు నిధులు కేటాయించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

కనిగిరిరూరల్: వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 17వ మహాసభల బహిరంగ సభ మంగళవారం బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో కరువు నివారణకు ఏకైక మార్గం వెలిగొండ ప్రాజెక్టు మాత్రమేనన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పట్ల పాలకులు వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఎండగట్టారు. 23 ఏళ్ల నుంచి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకపోడాన్ని తీవ్రంగా విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. నెరుసల వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, ఊసా వెంకటేశ్వర్లు, సయ్యద్ హనీఫ్, పీసీ కేశవరావు, కె.రమాదేవి, రాయళ్ల కొండయ్య, పిల్లి తిప్పారెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో భారీ ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



గ్రామోత్సవ వేడుకలు

కనిగిరిరూరల్: మండలంలోని లింగారెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భమరాంబ మల్లికార్జున, గణపతి, నాగబంధ, కాల భైరవ, నందీశ్వర, చండీశ్వర, అయ్యప్ప, నవగ్ర,ధ్వజ, బలి పీఠ నూతన విగ్రహ యంత్ర, శిఖర ప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈనెల 10 తేదీ నుంచి ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది. మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, మార్జనలు. జలాధి వాసాంగ బింబోద్వాసన, ప్రాతరాపాసన, లక్షణోద్ధారణ, లక్షణోద్ధరణ హోమం, పునః పూజ ప్రసాద వితరణ కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. సాయంత్రం గ్రామోత్సవం, ధాన్యాదివాసం, ధ్యానదివాసాంగ హోమం, సాయి మౌపాసన, పునః పూజ కార్యక్రమాలు జరిగాయి. శైవగామ ప్రతిష్టా చార్య బ్రహ్మ శ్రీ చంద్ర హౌళి భాస్కర శర్మ పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ సిద్ధాంతి, బ్రహ్మశ్రీ భీమసిని మణికంఠ శర్మ, ఆలయ శిల్పి పెద్దింశెట్టి సూర్యచంద్రరావు ఆలయ కమిటీ, గ్రామ పెద్దల పర్యవేక్షణ, ఆధ్వర్యంలో విశిష్ట పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పీసీపల్లి: అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.మండలంలోని మురుగమ్మి గ్రామానికి చెందిన ప్రదీప్(27) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మంగళవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

ముగిసిన 9వ రౌండ్ పొగాకు వేలం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారంతో తొమ్మిదో రౌండ్ పొగాకు వేలం ముగిసిందని నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం నుంచి పదో రౌండ్ వేలం ప్రారంభమవుతుందన్నారు. క్లస్టర్ పరిధిలోని వెన్నూరు, చిన్న వెంకన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు 984 బేళ్లను వేలానికి తీసుకురాగా 652 బేళ్లను కొనుగోలు చేసి 332 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.282, కనిష్ట ధర రూ.140, సరాసరి ధర రూ.226.09గా నమోదైంది.

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రం పరిధిలో మంగళవారం నిర్వహించిన వేలంలో 147 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 958 బేళ్లను వేలానికి తీసుకురాగా 811 బేళ్లను కొనుగోలు చేసి 147 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.140, సరాసరి ధర రూ.233.12గా నమోదైంది. వేలంలో 39 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



సిబ్బందిని సన్మానిస్తున్న గోపాల్‌రెడ్డి దంపతులు

పొన్నలూరు: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులు పట్ల అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి సిరిగిరి గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాలపాడు సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందికి మంగళవారం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అనంతరం శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సర్పంచ్ సిరిగిరి శ్రీదేవి, కార్యదర్శి రవి, అంగన్‌వాడీలు, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెళ్లయిన నాలుగు రోజులకే..

- ఉరేసుకొని నవ వధువు ఆత్మహత్య
- ఇష్టం లేని పెళ్లి చేయడంతోనే

పీసీపల్లి: ఇష్టం లేని పెళ్లి చేశారని పెళ్లయిన నాలుగు రోజులకే నవ వధువు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని మురుగమ్మి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన కోనంకి అనూష(22)కు సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లికి చెందిన వ్యక్తితో ఈ నెల 8వ తేదీన తల్లిదండ్రులు పెళ్లి చేశారు. అయితే ఈ వివాహం అనూషకు ఇష్టం లేదు. దీంతో సోమవారం సాయంత్రం ఇంట్లో అందరూ పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పెళ్లియిన నాలుగు రోజులకే ఆత్మహత్య చేసుకోవడంతో ఆ ఇంటిల్లిపాది విషాదంలో కూరుకుపోయారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

అరుదైన గ్రూపు రక్తదానం చేసిన కానిస్టేబుల్



రక్తదానం చేస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్

టంగుటూరు: అరుదైన ఏబీ పాజిటివ్ రక్తం దొరక్క గర్భసంచి ఆపరేషన్ కొన్ని రోజులుగా వాయిదా వేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బచ్చల చంద్రశేకర్ మంగళవారం ఉలవపాడు వెళ్లి రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రక్తం ఇచ్చిన చంద్రశేఖర్‌ను రోగి తరుపు బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.